
ఈనాడు మెదక్

గురువారం అక్టోబరు 10, 2024

వీణాధారి.. విద్యాప్రదాయిని




మెదక్ కాళికా మాత ఆలయంలో..



జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి ప్రతిమలను, ఆలయాల్లో అమ్మవార్లను బుధవారం ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ కాళికా దేవి ఆలయంలో, మెదక్ మండలం పేరూర్ గరుడగంగ వద్ద, చిన్నశంకరంపేటలో అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించి పూజలు చేశారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్, మెదక్‌రూరల్, చిన్నశంకరంపేట

మెదక్ మండలం పేరూర్‌లో..



చిన్నశంకరంపేట కొర్విపల్లిలో

ఉత్సాహంగా 2కే రన్




పరుగులో పాల్గొన్న రాహుల్ రాజ్, డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి, క్రీడాకారులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతిని బతుకమ్మ పండుగా ద్వారా ప్రపంచానికి చాటి చెప్పడమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెదక్ పట్టణం ఇందిరాగాంధీ స్టేడియం నుంచి రాందాస్‌చౌరస్తా వరకు నిర్వహించిన 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ ఉత్సవాలను పట్టణం నుంచి గ్రామం వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే పంచాయతీలు, మున్సిపాలిటీలో చిన్నారులకు వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. డీవైఎస్‌వో దామోదర్ రెడ్డి, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్రరాజు, పీడీలు మాధవరెడ్డి, మధు, దేవేందర్‌రెడ్డి, రాజేందర్, మహిపాల్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేత

మెదక్ టౌన్: తెలుగు వెలుగు జాతీయ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ తపాలదినోత్సవం సందర్భంగా నిర్వహించిన శీర్షికల పోటీల్లో ప్రతిభ కనబరిచిన రచయితలకు మెదక్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీహరి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'కమ్మని కబురు' రాసిన అంజయ్యకు, రాజమణి రాసిన 'ఎర్ర డబ్బా దగ్గరికి ఎవరు పోతారబ్బా' అనే శీర్షికలకు పత్రాలు అందించినట్లు ఆయన చెప్పారు.

నిరంతర సాధన.. లక్ష్య ఛేదన



పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించవచ్చని నిరూపించారు. నిరాశ చెందకుండా తమ కలలను సాకారం చేసేందుకు నిరంతరం సాధన చేసి సత్ఫలితాలను సాధించారు. ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగారు. పోటీని తట్టుకుని మేటీగా నిలిచారు. చిన్నారుల భవితకు బాటలు వేసే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలు అందుకున్నారు.

పట్టువీడకుండా..



జంగం నవీన్

న్యూస్‌టుడే: రామాయంపేట: ఒక ఉద్యోగం సాధించాలంటే గగనమే. అందులోనూ ప్రభుత్వ ఉద్యోగం అంటే నిరంతరం శ్రమించాల్సిందే. ఓ యువకుడు ఏకంగా నాలుగు సర్కార్ కొలువులు సాధించడం విశేషం. అతనే రామాయంపేట మండల పరిధి అక్కన్నపేటకు చెందిన జంగం నవీన్. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువు కొనసాగించారు. 2019లో అటవీశాఖలో బీట్ అధికారితోపాటు, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాన్ని సాధించాడు. బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తూనే గత నెలలో గురుకుల ఉపాధ్యాయుడి పరీక్షలు రాసి ముందు నిలిచాడు. అనంతరం డీఎస్సీ రాసి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి స్కూల్‌అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు.

భార్యాభర్తలకు ఒకే సారి..



చిన్నమొల్ల దినకర్, అనూష


వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి మండలం మానేపల్లి గ్రామానికి చెందిన దంపతులు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. చిన్నమొల్ల దినకర్ డీఈడ్, బీఎస్సీ, బీఈడ్ వరకు చదువుకుని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య అనూష ఎంఏ, బీఈడ్ పూర్తిచేసి ప్రభుత్వ ఎస్జీటీగా పని చేస్తూ, స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. ఉపాధ్యాయ ఉద్యోగమే తమ లక్ష్యంగా చదివామని వారు పేర్కొంటున్నారు.

అంధత్వాన్ని జయించి.. అనుకున్నది సాధించి



యాదయ్య

న్యూస్‌టుడే, టేక్మాల్: కంటి చూపు లేకపోయినా సంకల్ప బలంతో ముందుకు సాగి, అనుకున్నది సాధించారు. ఆయనే టేక్మాల్ మండల పరిధి ఎల్లంపల్లికి చెందిన యాదయ్య. 2015లో డైట్, 2023లో బీఈడీ పూర్తి చేశారు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. డీఎస్సీలో మూడు విభాగాల్లో ఇతరుల సాయంతో పరీక్ష రాశాడు. తెలుగు భాషోపాధ్యాయునిగా, ఎస్జీటీ, ఎస్ఏ సాంఘికశాస్త్రంలో డీఎస్సీ రాయగా అన్నింట్లో ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఎస్ఏగా ఎంపికయ్యాడు. చిన్నారులకు బోధన చేయాలన్నది తన ధ్యేయమని, ఆ లక్ష్యంతోనే ముందుకు సాగానని పిల్లలను తీర్చిదిద్దడమే తన కర్తవ్యమంటున్నారాయన.



హైదరాబాద్ ఎల్బీస్టేడియంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కొత్త ఉపాధ్యాయులకు సీఎం, మంత్రులు నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గానికి చెందిన శ్రావణికి పత్రం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి

తూప్రాన్ కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన



భవనం పరిశీలనలో జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద, అధికారులు

తూప్రాన్, న్యూస్‌టుడే: తూప్రాన్ డివిజన్ కేంద్రంలో కొత్తగా కోర్టు ఏర్పాటు చేసేందుకు జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద భవనాలను పరిశీలించారు. బుధవారం తూప్రాన్ పురపాలిక పరిధి అల్లాపూర్ చౌరస్తా సమీపంలో ఓ భవనం, సమీకృత మార్కెట్ ఎదురుగా నిర్మాణంలో ఉన్న భవనాలను ఆమె పరిశీలించారు. మార్కెట్ వద్ద నిర్మాణంలో ఉన్న భవనం అనుకూలంగా ఉంటుందని సూత్రప్రాయంగా ఖరారు చేశారు. భవన యజమానితో మాట్లాడి నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకటరెడ్డిలకు సూచించారు. పురపాలిక ఛైర్మన్ జ్యోతికృష్ణ, ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రభుదాస్, సీఐ రంగాకృష్ణ, ఎస్సై శివానందం, ఇన్‌ఛార్జి కమిషనర్ రఘువరన్ ఉన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు

మెదక్, న్యూస్‌టుడే: హోదా పక్కన బెట్టి స్వయం సహాయక సంఘాల మహిళలతో జిల్లా అధికారిణులు.. వారికి జతగా కలెక్టర్, అదనపు కలెక్టర్, ఆర్డీవో.. ప్రత్యేక ఆకర్షణగా కలెక్టర్ కూతుళ్లు.. కళాకారుల ఆట పాట... ఘుమఘుమలాడే పిండి వంటకాలు వెరసి బతుకమ్మ సంబరాలు బుధవారం మెదక్‌లో అంబరాన్నంటాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ శాఖల సిబ్బంది పూలతో బతుకమ్మలను పేర్చగా, జిల్లా అధికారిణులు బ్రహ్మాజీ, ఇందిరా, కరుణ, మాధవి, సరస్వతీ , ఆర్డీవో రమాదేవి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు శ్రీనివాస్‌రావు, శ్రీరాం, జెమ్లానాయక్, కలెక్టర్ కూతుళ్లు నిర్విక, రిత్విక బతుకమ్మ ఆడారు. కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పూలను దేవతగా పూజించి, ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యాన-పట్టు పరిశ్రమ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ , ఇందిరా మహిళా శక్తి జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రథమ మెప్మాకు ద్వితీయ, స్త్రీ, శిశు సంక్షేమశాఖకు తృతీయ బహుమతిని కలెక్టర్ అందజేశారు.



భారీ బతుకమ్మ

విస్తరించక.. విభాగిని లేక..

● మెదక్-నర్సాపూర్-హైదరాబాద్ రహదారిలో తరచూ ప్రమాదాలు



విభాగిని లేని 765-డి జాతీయ రహదారి

న్యూస్‌టుడే, నర్సాపూర్: మెదక్-నర్సాపూర్-హైదరాబాద్(765-డి) కీలక జాతీయ రహదారి. ఈ మార్గంలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల నుంచి మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు విభాగిని లేకపోవడంతో ప్రయాణం అంటేనే జంకుతున్నారు. నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంటోంది. 47 కిలోమీటర్ల అటవీ మార్గంలో పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇవ్వడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

అటవీ మార్గంలో మలుపులు...

ఆరేళ్ల క్రితం రెండు వరుసలతో ఉన్న ఈ మార్గాన్ని మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం మండల కేంద్రాల మీదుగా మెదక్ సమీపంలోని రాంపూర్ వరకు 62.92 కిలోమీటర్ల పొడవునా జాతీయ రహదారిగా విస్తరించారు. ఇందులో కేవలం 15కిలోమీటర్ల రోడ్డును మాత్రమే వంద అడుగులతో నాలుగు వరుసలతో విస్తరించారు. మిగిలిన 48కిలోమీటర్ల రోడ్డును పది మీటర్ల వెడల్పుతో విస్తరించారు. బాహ్య వలయ రహదారి నుంచి సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల వరకు 12కిలోమీటర్ల రోడ్డు నాలుగు వరుసలతో నిర్మించారు. గుమ్మడిదల నుంచి నర్సాపూర్ పట్టణం వరకు పది మీటర్ల రోడ్డును నిర్మించారు. ఇందులో చాలావరకు అటవీ ప్రాంతం ఉండగా విభాగిని నిర్మాణానికి కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు లభించలేదని అధికారులు పేర్కొంటున్నారు.

రాత్రిపూట అంధకారం...

ఈ మార్గంలో రాత్రివేళ అంధకారం నెలకుంటోంది. ప్రమాదకర మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డును విస్తరించి లైటింగ్ వ్యవస్థ అందుబాటులోకి తెస్తే రాత్రివేళల్లోనూ వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించడానికి వీలుంటుంది. అటవీ మార్గంలో విభాగినిలు నిర్మిస్తే వన్యప్రాణులు రోడ్డు దాటడానికి ఇబ్బందులు ఎదురవుతాయని, అవి ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని అంటున్నారు. ఈనేపథ్యంలోనే అనుమతించడం లేదని తెలుస్తోంది. మరోవైపు ఈసీ(పర్యావరణ అనుమతులు) కోసం దస్త్రం అటవీ శాఖ వద్ద అపరిష్కృతంగా ఉంది. వారాంతపు సెలవు దినాల్లో మెదక్, చర్చి, ఏడుపాయల వనదుర్గమాత, తునికి నల్లపోచమ్మ, పోచారం అభయారణ్యం, మేడాలమ్మ ఆలయాల వైపు వస్తున్న వారు ప్రమాదాల బారినపడుతున్నారు.

నివారణకు చర్యలు

రామకృష్ణ, డీఈ, ఎన్‌హెచ్

పట్టణాల్లో మినహా ఎక్కడా పది మీటర్లపైన రోడ్డు విస్తరణకు అవకాశమే లేదు. అందులోనూ విభాగిని ఏర్పాటు కూడా లేదు. ప్రమాదాలు జరుగుతున్న విషయం వాస్తవమే. అయితే తదనుగుణంగా ప్రమాదాల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం.

వనదుర్గకు ప్రత్యేక పూజలు



గోకుల్‌షెడ్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు దంపతులు

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయల వనదుర్గా మాతను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఆయన సతీమణి శివాని బుధవారం దర్శించుకున్నారు. గోకుల్ షెడ్‌లో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌రెడ్డి, గోవింద్ నాయక్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో యజ్ఞం



రేణుకాంబను దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి దంపతులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ పట్టణం ఫతేనగర్ దుర్గా మాత, వేణుగోపాల స్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పసుపులేరు రేణుక ఎల్లమ్మ ఆలయంలో యజ్ఞం నిర్వహించారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దంపతులు పూజలు చేశారు. కార్యక్రమంలో పురపాలక ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్, సంఘం బాధ్యులు పాల్గొన్నారు

'తులం బంగారం ఇవ్వాలని ఒత్తిడి తెస్తాం'



కౌడిపల్లిలో చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: కల్యాణలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం తులం బంగారం ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. బుధవారం కౌడిపల్లి రైతు వేదికలో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ వచ్చినా ఇంతవరకు మహిళలకు చీరలు ఇవ్వలేదన్నారు. కొల్చారం మండల పరిషత్ కార్యాలయంలో 76 మంది లబ్ధిదారులకు, చిలప్‌చెడ్ మండల పరిధి శీలంపల్లి రైతు వేదికలో 26 మంది లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలను అణచివేయడం తగదు: ప్రభాకర్‌రెడ్డి



హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త

దుబ్బాక, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అణచివేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ, వారికి భారాస సంఘీభావం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నూతన ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేసే కార్యక్రమాన్ని భారాస ఎమ్మెల్యేలు అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో నియోజకవర్గ పర్యటనకు బయలుదేరిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్ కొండాపూర్‌లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా తనను అడ్డుకున్న పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై మాదాపూర్ అదనపు డీసీపీ జయరాంతో మాట్లాడి, మాదాపూర్‌లోని తన కార్యాలయానికి వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరారు. కార్యాలయానికి వెళ్లాక బయటకు రాకుండా హౌస్ అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు, అడ్డంకులు సృష్టించినా, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని ఎమ్మెల్యే అన్నారు.

హెచ్‌ఎండీఏ పరిధిలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ

మనోహరాబాద్, న్యూస్‌టుడే: హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధి నిర్ధారించాలని అధికారుల ఆదేశాల మేరకు సర్వే చేపట్టినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మనోహరాబాద్‌లోని జంసాయి కుంట సర్వే చేపట్టారు. స్థానికులు అక్కడికి చేరుకుని కుంట పరిధిలో చాలా ఏళ్లుగా భూములను అభివృద్ధి చేసుకున్నామని, ఇక్కడ సర్వే చేయవద్దని తహసీల్దార్‌ను కోరారు. పట్టాదారులు ధ్రువీకరణ పత్రాలు అందజేసి, అభ్యంతరాలను రాతపూర్వకంగా ఇవ్వాలని తహసీల్దార్ వారికి సూచించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని భూముల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టవద్దని వ్యవసాయం చేసుకుంటే అభ్యంతరం లేదన్నారు. భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేపట్టి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల నిర్ధారణ చేస్తున్నామన్నారు. ఆర్ఐ దీక్షిత్‌కుమార్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ సిబ్బంది ఉన్నారు.

రాయితీ పరికరాలపై చిగురిస్తున్న ఆశలు



రోటోవేటర్



గడ్డికత్తిరించే యంత్రం



వరికోత యంత్రం



దమ్ము చక్రాలు

జిల్లాలో ఇలా

మండలాలు: 21	గ్రామాలు: 469
రైతులు: 2,80,949	
సాగు విస్తీర్ణం: 3,41,915 ఎకరాలు	
ట్రాక్టర్లు: సుమారు 4 వేలు	

న్యూస్‌టుడే, చేగుంట: గతంలో సేద్యం చేసేందుకు ఎద్దులు, నాగళ్ల వినియోగం ఉండేది. రానురాను పరిస్థితిలో మార్పు వచ్చింది. సాంకేతికత పరిజ్ఞానం పెరిగే కొద్దీ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని రాయితీపై అందిస్తే ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రక్రియను పునరుద్ధరిస్తామని, ఇందుకోసం ఏటా రాష్ట్రంలో రూ.600 కోట్లు ఖర్చు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల ప్రకటించారు. దీంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రోటోవేటర్, మూడు కాళ్ల నాగళ్లు, ఆఫ్ కేజ్‌వీళ్లు, గొర్రు, మందులు పిచికారీ చేసే డబ్బాలు గతంలో 50 శాతం రాయితీపై ఇచ్చారు. వీటికోసం వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని పొందుతుండేవారు. అనంతరం నిలిపివేయడంతో రైతులకు భారంగా మారింది.

నిధులు లేక: బడ్జెట్‌లో పరికరాలకు నిధుల కేటాయింపు లేకపోవడంతో అందుబాటులో లేకుండా పోయాయి. తారు రోడ్లు ధ్వంసం అవుతున్నాయని దమ్ము చక్రాలను ప్రభుత్వం రద్దు చేసింది. అనంతరం ఆఫ్ కేజ్‌వీల్స్‌ను అందుబాటులోకి తెచ్చినా, అందుబాటులో ఉంచలేదు. దీనివల్ల ధర ఎక్కువ చెల్లించి మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు.

ఎక్కువ ధర చెల్లించి: జిల్లాలోని ప్రతి గ్రామంలో కనీసం ఐదు కంటే ఎక్కువ ట్రాక్టర్లున్నాయి. చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో 50కి పైగా ఉన్నాయి. ముఖ్యంగా గొర్రు పరికరానికి ఎక్కువ డిమాండ్ ఉంది. ప్రభుత్వం రాయితీని నిలిపివేసినా, వ్యాపారస్థులు మార్కెట్‌లో ధర రెట్టింపు చేసి అమ్ముతున్నారు. రైతులు తప్పని పరిస్థితుల్లో వాటిని కొనుగోలు చేస్తున్నారు. .

అవసరం ఎక్కువే: మెదక్, చేగుంట, రామాయంపేట, పాపన్నపేట, నర్సాపూర్, నిజాంపేట, నార్సింగి, శివ్వంపేట, వెల్దుర్తి, చిన్నశంకరంపేట, కొల్చారం, హవేలిఘనపూర్, తూప్రాన్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, టేక్మాల్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, రేగోడ్ మండలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న పంటలను సాగు చేస్తారు వరి నాట్లు వేసేందుకు రొప్పుగొర్లు అవసరం ఉంటాయి. పత్తి సాగుచేసే రైతులకు మూడు కాళ్ల గొర్లు, కలుపుతీతకు దంతెలు అవసరం. సంఘాల ఆధ్వర్యంలో పరికరాలను అందుబాటులో ఉంచినా, ప్రచారం లేక ప్రయోజనం ఉండడంలేదు.

రాజధానికి తరలిన డీఎస్సీ అభ్యర్థులు



బస్సులకు జెండా ఊపుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్, న్యూస్‌టుడే: డీఎస్సీ 2024లో ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు బుధవారం హైదరాబాద్ వెళ్లారు. ఎంపికైన వారికి సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు అందజేసే కార్యక్రమానికి జిల్లా నుంచి అన్ని విభాగాల్లో ఎంపికైన 272 మంది అభ్యర్థులు ఆరు బస్సుల్లో వెళ్లారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద జిల్లా విద్యాధికారి రాధాకిషన్ జెండా ఊపి పంపించారు.

ఠాణాలో మహిళా ఏఎస్ఐ ఆత్మహత్యాయత్నం

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళ ఏఎస్ఐ సుధారాణి బుధవారం రాత్రి ఠాణాలోనే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సుధారాణి రెండేళ్లుగా స్థానిక ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి హెడ్‌కానిస్టేబుల్ సైదయ్య, సుధారాణి విధుల్లో ఉన్నారు. సైదయ్య బయటకు వెళ్లి వచ్చేలోపు, ఆమె తన చున్నితో పంకాకు ఉరేసుకుంటుండగా, లోపలికి వచ్చిన ఆయన అడ్డుకున్నారు. వెంటనే ఆమెను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. బాధితురాలి వద్ద సూసైడ్ నోట్‌ను పోలీసులు గుర్తించారు. రెండు రోజుల నుంచి ఆమె విధులకు హాజరు కావడం లేదని సిబ్బంది తెలిపారు.

2వేల ఏళ్లనాటి టెర్రకోట గిరక లభ్యం



నంగునూరు, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా నంగునూరులో 2వేల ఏళ్ల నాటి టెర్రకోట మట్టి గిరక లభ్యమైనట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధన సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. బుధవారం నంగునూరు పాటిగడ్డ సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో 5 అంగుళాల ఎత్తు, 3 అంగుళాల వెడల్పుతో కలిగిన అద్భుతమైన పనితనం కలిగిన మట్టి గిరక లభ్యమైంది. దీన్ని నీళ్లు తోడడానికి గానీ.. మగ్గం నేయడానికి ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఈ గిరకకు ఉన్న గాడి లోతు, అంచుల వంపును బట్టి దీని మీద మందపు తాళ్లు వాడినట్లు గుర్తులు కనిపిస్తున్నాయని తెలిపారు.

గడువులోగా స్టేషన్ పునరాభివృద్ధి పనులు

డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్



పునరాభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్

జహీరాబాద్ అర్బన్: అమృత్ భారత్ స్టేషన్ పునరాభివృద్ధి పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం భరతేశ్‌కుమార్ జైన్ అధికారులకు సూచించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ రైల్వేస్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి చేపడుతున్న పనులను పరిశీలించారు. స్టేషన్ ముఖద్వారం, వెయిటింగ్ హాల్, సీవోపీలు, ఎస్కలేటర్ సహా పార్కింగ్ ప్రాంతాల్లో నిర్మాణాలను సందర్శించి పనుల నెమ్మదిగా జరుగుతున్న తీరుపై అసంపూర్తి వ్యక్తం చేశారు. స్టేషన్ ప్రధాన ముఖద్వారం ఎర్రరాయి కట్టడంతో ఉన్నందున కొత్త నిర్మాణ అనుసంధానంలో ఇబ్బందులపై అధికారులు వివరించారు. అవసరమైతే పూర్తిగా తొలగించి త్వరగతిన నిర్మాణం పూర్తిచేయాలని సూచించారు. స్టేషన్ మేనేజర్ మాధవకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. బీదర్-తిరుపతి రైలును జహీరాబాద్‌లో నిలిపేలా చూడాలని స్థానిక భాజపా నేతలు వినతిపత్రం అందజేశారు.

మనసు.. మాట వింటోందా!



కౌన్సెలింగ్, థెరపీలతో పరిష్కారం

'మీరు మానసికంగా ఎంత స్థిరంగా ఉన్నా.. మీ మాటలు, చర్యల వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు ఎంతలా బాధపడుతున్నారో?' ఎప్పుడైనా ఆలోచించారా.. మనసు స్థితి తేడాగా ఉందని తెలుస్తున్నా పరిష్కార మార్గానికి వైద్యులను ఆశ్రయించేందుకు వెనుకాడుతున్నారా.. అనేక అపోహలు.. మూఢ నమ్మకం.. తీవ్రమైన ఒత్తిడి, తెలియని ఆందోళన.. తరచూ తప్పుడు ఆలోచనలు.. వీటి నుంచి బయట పడితేనే జీవితం చక్కగా సాగుతుంది. చాలామంది వివిధ కారణాలతో మానసిక పరమైన జబ్బులతో వేదనకు గురవుతున్నారు. బాధితులతో పాటు కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని నిపుణులు చెబుతున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

న్యూస్‌టుడే, సిద్దిపేట:

మానసిక ఆరోగ్యంపై అవగాహన లేక కొందరు కుంగిపోతున్నారు. సమస్య ఉన్నా.. ఏమి లేదనే భావనతో కాలం వెళ్లదీస్తున్నారు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అత్యధిక శాతం ఆరోగ్యంగా ఉన్నా.. అనారోగ్య సమస్యలు ఉన్నాయనే భావన (హైపో కాండ్రియాసిస్)తో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ రకాల పరీక్షలు చేస్తున్నా.. పరిష్కారం లభించక మదన పడుతున్నారు. ఎక్కువగా గుండె జబ్బు ఉందనే భావన వ్యక్తమవుతోంది. ఆయా పరిణామాలతో పలువురు ఇంటికే పరిమితవుతున్నారు. చివరికి మానసిక వైద్య నిపుణులను సంప్రదించడం ద్వారా అపోహలు తొలగిపోతున్నాయి. చిన్నపాటి విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. కుటుంబ కలహాలతో మనోవేదనకు గురై.. మానసిక అనిశ్చితి ఏర్పడుతోంది.



బాధితుడితో మాట్లాడుతున్న డాక్టర్ శాంతి



కీలకంగా సేవలు


సిద్దిపేట ప్రభుత్వ వైద్య కళాశాల అనుబంధ సర్వజన ఆసుపత్రిలో మానసిక వైద్య విభాగం (సైక్యాట్రీ) సేవలు కీలకంగా మారాయి. నిత్యం సగటున 50 మంది ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారు. ఇక్కడ మొత్తం 30 పడకలు అందుబాటులో ఉన్నాయి. 15 - 20 మంది ఇన్‌పేషెంట్లుగా చేరుతున్నారు. ప్రాథమిక దశలో మానసిక జబ్బులతో చేరిన వారికి కౌన్సెలింగ్ ద్వారా మార్పు తెస్తున్నారు. పలు రకాల థెరపీలను అందిస్తున్నారు. రోగిస్థాయి ఆధారంగా గరిష్ఠంగా ఆరు నెలల వరకు చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం బాగైన తరువాత వారిని ఉదాహరణగా చూపుతూ.. మార్పు సాధ్యమంటూ రోగుల్లో ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. మానసిక ఒత్తిడి, కుంగుబాటు, చేసిన పనే చేయడం, సైకోసిస్, తదితర విభాగాల్లో బాధితులకు బాసటగా నిలుస్తున్నారు. డీ-అడిక్షన్ కేంద్రం సేవలు కీలకంగా మారుతున్నాయి.

సకాలంలో సేవలు పొందాలి..

– ప్రొఫెసర్ డా. శాంతి, మానసిక వైద్య నిపుణురాలు (సిద్దిపేట సర్వజన ఆసుపత్రి)

సేవలు అందించే క్రమంలో సైక్యాట్రీ చరిత్ర మొత్తం తెలుసుకుంటాం. కుటుంబ, వ్యక్తిగత వివరాలు, మానసిక స్థితి తెలుసుకొని ఒక అంచనాకు వస్తుంటాం. మానసిక స్థితిని పరీక్షిస్తాం. ఆలోచనలు, ఏకాగ్రత, నిర్ణయాలు తీసుకునే విచక్షణ, మాట్లాడే విధానం.. ప్రతీది కచ్చితమైన అంచనాతో చికిత్సలు చేస్తుంటాం. అవసరమైన వైద్య పరీక్షలు ఉంటాయి. కౌన్సెలింగ్, చికిత్స, థెరపీల ద్వారా బాగు చేస్తున్నాం. కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేపడుతున్నాం. మానసిక సమస్యలతో బాధపడే వారు సకాలంలో ఆసుపత్రికి రావడం లేదు. మార్పు రావాలి. డబ్బును వృథా చేసుకోవద్దు. ప్రతీ సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని గ్రహించి నిర్ణయం తీసుకోవాలి.

పరిణామాలు ఇలా..



- మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారు. మానేసే ప్రయత్నాలు విఫలమై తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు.
- స్వతహాగా కలవరపాటుకు గురవుతున్నారు. అనుమానాలు పెంచుకుంటున్నారు.
- అతి శుభ్రత (ఓసీడీ)తో ఇతరులను ఇబ్బందికి గురిచేస్తున్నారు.
- అభూత కల్పనతో గడిపేస్తున్నారు.
- మూఢ నమ్మకాలను విశ్వసిస్తున్నారు.
- లైంగిక, నిద్రలేమి లాంటి సమస్యల్లో చిక్కుకుంటున్నారు.
- విశ్రాంతి లేని జీవనం, తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో నాలుగు రజతాలు



అథ్లెట్లతో వెంకటస్వామిగౌడ్

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: హనుమకొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సిద్దిపేట జిల్లా అథ్లెట్లు సత్తా చాటారు. ఏకంగా నాలుగు రజత పతకాలు సాధించారు. డెకథ్లాన్, హైజంప్ అంశాల్లో రాఘవాపూర్‌కు చెందిన గ్యార లీలాఆనంద్ రెండు రజత, అండర్-18 విభాగంలో కొండపాకకు చెందిన నగేశ్ జావెలిన్‌త్రోలో రజత పతకం, ఇదే కేటగిరిలో షాట్‌పుట్‌లో అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు చెందిన వాసు రజత పతకం సాధించారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గ్యాదరి పరమేశ్వర్, వెంకటస్వామిగౌడ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా యువజన క్రీడల ఇన్‌ఛార్జి అధికారి జయదేవ్ ఆర్య, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి సౌందర్య, ప్రతినిధులు, శిక్షకులు అభినందించారు.

'విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వాలు'

సిద్దిపేట: విశ్వబ్రాహ్మణుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కార్పొరేషన్ సాధనకు సమష్టిగా ఉద్యమించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అన్నారు. సిద్దిపేటలో సమావేశానికి హాజరైన ఆయన జిల్లా అధ్యక్షుడు సాయన్నగారి శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కుటీర పరిశ్రమలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని, 50 ఏళ్లు నిండిన వారికి పింఛను ఇవ్వాలని, రాయితీపై కలపను అందించాలని, అటవీ అధికారుల దాడులు నివారించాలన్నారు. సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు గోపాలచారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్ తదితరులు ఉన్నారు.

జ్ఞానసమాజమే లక్ష్యం

27న 'స్వేరోస్' కన్వెన్షన్: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్, ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: విద్యాభ్యాసాన్నే ఆయుధంగా మలుచుకుని జ్ఞాన సమాజమే లక్ష్యంగా స్వేరోస్ నెట్‌వర్క్ కొనసాగుతుందని సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ఆర్. ఎస్. ప్రవీణ్‌కుమార్ అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా తమ నెట్‌వర్క్ నడుస్తుందన్నారు. అణచివేత, సామాజిక రుగ్మతలు, గంజాయికి వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని చెప్పారు. ఈనెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో స్వేరోస్ జాతీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సిద్దిపేటలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశానికి ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు. బిజినెస్ అంశంపై సమాలోచనలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి వైపు యువత ఏ విధంగా నడవాలనే అంశంపై చర్చిస్తామన్నారు. రాష్ట్ర కన్వీనర్ దుర్గయ్య, కోకన్వీనర్ వీరన్న, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, జిల్లా అధ్యక్షుడు ఉప్పలేటి బాబు, ప్రధాన కార్యదర్శి చిన్నికృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.



సిద్దిపేట: పార్వతీమాత ఆలయంలో నాణేలతో అభిషేకం



కుమార్తెలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది



సంగారెడ్డిలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారిణులు, సిబ్బంది

దర్శనంతో తాదాత్మ్యం.. ఆటాపాటతో ఆనందం

న్యూస్‌టుడే, పాపన్నపేట, మెదక్, సంగారెడ్డి టౌన్, సిద్దిపేట టౌన్: 'శ్రీమహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి బాలత్రిపురసుందరి మాతాయై నమః' అని మండపాలు, అమ్మవారి ఆలయాల్లో మంత్రోచ్ఛారణలు మార్మోగుతున్నాయి. 'ఇద్దరక్కచెల్లెళ్లు ఉయ్యాలో.. ఒక్కూరికిచ్చి ఉయ్యాలో..' అని మహిళల ఆటాపాట సందడి పూల పరిమళాల మధ్య ఉత్సాహభరితం చేస్తోంది. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్లలో కలెక్టర్లు రాహుల్‌రాజ్, వల్లూరు క్రాంతి, వారి కుటుంబ సభ్యులు బతుకమ్మల చుట్టూ ఆడారు. కొన్నిచోట్ల 8వ రోజున సద్దుల బతుకమ్మ పండుగ చేసి స్థానిక నీటివనరుల్లో నిమజ్జనం చేశారు.



సరస్వతిమాత అలంకరణలో ఏడుపాయల వనదుర్గ


నదిలో పడి యువకుడి మృతి



రమేష్

మనూరు, న్యూస్‌టుడే: ప్రమాదవశత్తు కాలు జారి నదిలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మనూరు మండలం రాయిపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మున్నూర్ రమేష్(26) కాళ్లు కడుక్కుందామని నది వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నదిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చెరువులో పడి రైతు..



యాదయ్య

టేక్మాల్, న్యూస్‌టుడే: స్నానం చేసేందుకు చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కుసంగి గ్రామ శివారులో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రాజేశ్ తెలిపిన వివరాలు.. కుసంగి గ్రామానికి చెందిన ముస్లాపరం యాదయ్య(50) వ్యవసాయంతో పాటు మేకలను పెంచుతూ జీవిస్తున్నాడు. ఈ నెల 7న మేకలు మేపడానికి వెళ్లాడు. స్థానిక పెద్ద చెరువులో స్నానం చేద్దామని దిగాడు. ఈత రాకపోవడంతో చెరువులో మునిగి చనిపోయాడు. మేకలు ఇంటికి వచ్చినా యాదయ్య రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. ఆచూకీ దొరకలేదు. బుధవారం చెరువులో మృతదేహం తేలింది. తమ్ముడు రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యాదయ్యకు భార్య బూదవ్వ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలకు వివాహాలు అయ్యాయి.

ఈత నేర్పేందుకు వెళ్లి మృత్యువాత

చిన్నకోడూరు, నంగునూరు: ఈత నేర్పడానికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశత్తు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన చిన్నకోడూరు మండలంలోని ఓబులాపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసీఫ్ తెలిపిన వివరాలు.. జక్కుల ఎల్లయ్య(38) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతనికి భార్య భారతవ్వ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం ఉదయం ఎల్లయ్య తన సోదరుడు కుమారుడికి ఈత నేర్పించడానికి చెరువు వద్దకు తీసుకెళ్లాడు. ఎల్లయ్య చెరువులోకి దిగి ప్రమాదవశత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన బాలుడు పరుగెత్తుకుంటూ వచ్చి గ్రామస్థులకు తెలిపాడు. వారు వెళ్లి ఎల్లయ్యను బయటకు తీసి చూడగా అప్పటికే మృతి చెందాడు. తల్లి ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

రామలింగేశ్వరస్వామీ.. నీవైనా చెప్పవూ..

- 'ప్రసాద్' పథకానికి 'కూడవెల్లి' ఎంపికై రెండేళ్లు
- అడుగులు పడక.. పర్యాటకాభివృద్ధికి నోచుకోక..

న్యూస్‌టుడే, దుబ్బాక

మన దేశంలో పర్యాటక రంగం ఎక్కువగా ఆధ్యాత్మిక క్షేత్రాల చుట్టూ ఉంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ కోణాల్లో ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది. కానీ ప్రధానంగా భక్తులకు, పర్యాటకులకు మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చితే ఆదరణ అధికంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం సిద్దిపేట జిల్లా కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకానికి ఎంపిక చేసింది. అమలు చేయడంలో వెనుకబాటులో ఉంది.



శిథిలావస్థకు చేరిన గుళ్లు



రామలింగేశ్వర స్వామి

మిగిలినవి 9 ఎకరాలే

ఏడాది పొడవునా నిత్య పూజలను అర్చకులు నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో భక్తుల సంఖ్య రాకపోకలు తక్కువగా ఉంటోంది. గుడి భూములు అన్యాక్రాంతమయ్యాయి. ప్రస్తుతం కేవలం 9 ఎకరాలు మాత్రమే మిగిలాయి. ఇక్కడ 2004లో కల్యాణ మండపం నిర్మించినా పూర్తిస్థాయిలో వసతులు లేక వినియోగించటం లేదు. 2018లో దేవాదాయ శాఖ రూ.1.25 కోట్ల సర్వ శ్రేయోనిధి నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రాకార మండపం, రాజ గోపురం, ప్రహరీ కొంతమేర పూర్తయ్యాయి. 'ప్రసాద్' పథకానికి ఎంపికైనా నేటి వరకు ఆలయ పరిసరాల్లో పనులు చేపట్టలేదని.. రాష్ట్ర దేవాదాయ, పర్యాటక అభివృద్ధి శాఖల దృష్టికి తీసుకెళ్తామని.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటామని ఈవో విశ్వనాథశర్మ తెలిపారు.

పథకం అమలైతే సమకూరేవి

- కూడవెల్లి వద్ద రూ.కోటి నిధులతో ఒక ఎకరా స్థలంలో 20 రకాల మౌలిక వసతులు నిర్మిస్తారు.
- తీర్థయాత్ర సమాచార కేంద్రం, వెయిటింగ్ లాంజ్, శౌచాలాయాలు, ప్రసాదం కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రం, సంచులు పెట్టే గదులు, క్యాంటీన్, దుకాణాలు, బహుళ ఉపయోగకరమైన హాల్.

2022 నుంచి ఏం చేశారు?

- ఆలయ ఈవో 2022 నవంబరులో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థకు, కేంద్ర పర్యాటక శాఖకు ప్రసాద్ పథకం అమలుకు కేటాయించే ఒక ఎకరా భూమి వివరాలు పంపించారు.
- పర్యాటక శాఖ అధికారులు ఆలయాన్ని సందర్శించారు.
- మౌలిక వసతులపై అంచనా వేసి, భూమి మట్టిని పరీక్షకు తీసుకెళ్లారు.

ఏమేం చేయాలి?

- కాశీ విశ్వనాథుడు, వేంకటేశ్వరుడు, బొబ్బిలి వీరన్న స్వామి గుళ్లు శిథిలమయ్యాయి. పునర్నిర్మించాలి.
- తాగునీరు సౌకర్యం కల్పించాలి.
- వాగులో పుణ్యస్నానాలు ఆచరించడానికి స్నాన ఘట్టాలు, దుస్తులు మార్చుకోవడానికి గదులు అవసరం.
- వాగులో వేసే పిండాలు, అస్థికలు, ఇతరత్రా కర్మకండ సామగ్రితో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఏర్పాట్లు చేయాలి.

గుడి విశేషాలు

- అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని రామేశ్వరంపల్లి పరిధిలో కూడవెల్లి వాగు ఒడ్డున గుడి నెలవైంది.
- శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం అని క్షేత్రపురాణంతో ప్రసిద్ధికెక్కింది. శతాబ్దాల చరిత్ర ఆలయానికి ఉంది.
- కాశీ నుంచి ఆంజనేయస్వామి తెచ్చిన శివలింగం.. శ్రీరాముడు ప్రతిష్ఠించిందీ రెండూ ఒకే ప్రాణవట్టంపై దర్శించుకోవడం విశిష్టత.
- మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ జిల్లాల భక్తులు ఎక్కువగా ఇక్కడికి వస్తారు.
- 'కాళేశ్వరం' ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు కూడవెల్లి వాగులోకి ప్రవహిస్తుండటంతో ఏడాది పొడవునా గుడి వద్ద జలకళ ఉట్టి పడుతోంది.
- ఆలయ ప్రాంగణంలో రాధారుక్మిణీ వేణుగోపాలుడు, దాసాంజనేయుడు, సంగమేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, పార్వతిమాత, గణపతి గుళ్లు దర్శనమిస్తాయి.
- గుడి పక్కనున్న కూడవెల్లి వాగులో పితృదేవతలకు పిండప్రదానాలు, అస్థికల నిమజ్జనం నిర్వహించుకోవచ్చు.
- శ్రావణం, కార్తికం, మాఘ మాసాల్లో .. ఇతర పండుగల రోజుల్లో జాతరలు, విశేష పూజలు జరుగుతాయి.

పురాతన ఇల్లు.. ప్రేమగా హంగులు



రంగు వేయడంతో ఆకట్టుకుంటున్న పెంకులు



ఇంటి లోపలి భాగం

పెద్దలు ఇచ్చిన ఆస్తిపాస్తులను యథాతథంగా దశాబ్దాలు గడిచినా కాపాడుకుంటూ వాడుకోవడం అరుదుగా చూస్తుంటాం. ఇళ్లు ఒక దశకు శిథిలావస్థకు చేరుతాయి. వాటికి కొద్దిపాటి మార్పులు, మరమ్మతులు చేస్తే అనేక ఏళ్లపాటు కుటుంబానికి అండగా ఉంటాయి. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం గుండారెడ్డిపల్లికి చెందిన భూంపల్లి సంజీవరెడ్డి.. తన ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న ఇంటిని కొద్దిపాటి అధునాతన మార్పులు చేసుకొని కాపాడుకుంటున్నారు. అందులో భార్యతో కలిసి నివసిస్తున్నారు. చిన్నపాటి గుత్తేదారుగా పనులు చేసుకుంటున్న సంజీవరెడ్డికి పురాతన ఇంటిపై అమితమైన ప్రేమ. పైకప్పు పెంకులకు కొత్తగా రంగులు వేశారు. లోపల బండలు మార్చారు. ఇంటిలోని మొగురాలు, దూలాలు మార్చకుండానే వాటికి ఆకర్షణీయమైన రంగులు వేశారు. ఇంటిని పూర్తిగా తొలగించకుండానే అధునాతనంగా ఆకర్షణీయంగా మార్చుకున్నారు. ఊరిలో తన ఇల్లు వైవిధ్యంగా కనిపిస్తుండటం సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. వారి పిల్లలు విదేశాల్లో ఉంటున్నారు.

- న్యూస్‌టుడే, కోహెడ గ్రామీణం

వాహనం అదుపుతప్పి కార్మికుడి దుర్మరణం

మునిపల్లి, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుదేరా శివారు జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో కంపెనీ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఏఎస్సై ఏసయ్య తెలిపిన వివరాలు.. సదాశివపేట పట్టణానికి చెందిన పరిగి సాయికిరణ్ (29) ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. దిగ్వాల్ నుంచి సదాశివపేటకు బుధవారం ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్న క్రమంలోనే మృతి చెందాడు. భార్య వసంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

టేక్మాల్: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్సై రాజేశ్, స్థానిక ఆర్ఐ సాయిశ్రీకాంత్ తెలిపిన వివరాలు.. మహారాష్ట్ర ఉమర్గ గ్రామానికి చెందిన బాలాజి కుమ్మర్ సుమారు 35 క్వింటళ్ల రేషన్ బియ్యాన్ని తన ఆటోలో తరలిస్తున్నాడు. హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న క్రమంలో బుధవారం బొడ్మట్‌పల్లి శివారులో పోలీసులకు బియ్యం పట్టుబడ్డాయి. వాహనాన్ని ఠాణాకు తరలించారు. పట్టుబడిన బియ్యాన్ని పాపన్నపేటలోని ఓ రైస్ మిల్‌కు తరలించి అక్కడే నిల్వ ఉంచినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేశారు.



చికెన్ ధరలు			
ఫాంరేటు	114–00	డ్రెస్డ్	197–00
రిటైల్	136–00	స్కిన్‌లెస్	224–00

అమ్మమ్మ, నాయనమ్మల కళ్లుగప్పి

ఆడ శిశువు అపహరణ

- సీసీ ఫుటేజీలో అనుమానితుల కదలికలు గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన



శిశువును తీసుకెళ్లినట్లు అనుమానిస్తున్న మహిళలు (సీసీ ఫుటేజీ)

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: భూమి మీద పడి ఒక్క రోజు కూడా కాకుండానే ఆ ఆడ శిశువు తల్లికి దూరమైంది. సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో అమ్మమ్మ, నాయనమ్మల పక్కన సేదతీరుతుండగా పట్టపగలు.. ఇద్దరు మహిళలు అపహరించుకు పోవడం కలకలం రేపింది. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం. . సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దూదిగొండ గ్రామానికి చెందిన ఆటోడ్రైవరు అబ్బాస్ అలీ, నసీమా(25) దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఒక మగ బిడ్డ గతంలో మరణించారు. ఐదో కాన్పు కోసం భర్తతో కలిసి మంగళవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో నసీమా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సిజేరియన్ ద్వారా ఆడ పిల్లకు జన్మనిచ్చింది. ఆ శిశువును కింద పడుకోబెట్టి మనమడితో కలిసి అమ్మమ్మ మునీబీ, నాయనమ్మ హమీదాలు మధ్యాహ్నం ఆస్పత్రి కారిడార్‌లో కూర్చున్నారు. బురకాలు ధరించిన ఇద్దరు గుర్తుతెలియని మహిళలు వారి కళ్లుగప్పి శిశువును ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత శిశువు కన్పించకపోవడంతో అవాక్కయి ఆస్పత్రి పర్యవేక్షకుడు అనిల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే పట్టణ సీఐ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. సంగారెడ్డి డీఎస్పీ, సీఐలు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. ఆసుపత్రితో పాటు పట్టణంలోని ఇతర ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను జల్లెడ పట్టారు. తొలుత ఇద్దరు గుర్తుతెలియని మహిళలు ఆసుపత్రి లోపలికి వచ్చి శిశువును అపహరించి, బయట వేచి ఉన్న మరో ఇద్దరు మహిళలకు ఇవ్వగా వారు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లినట్లుగా గుర్తించారు. ఆటోలో ఇద్దరు.. స్కూటీపైన ఇద్దరు ఘటనా స్థలికి చేరుకున్నట్లు సీసీ ఫుటేజీల్లో నమోదైంది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు.

పది బృందాల ఏర్పాటు

ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. శిశువును గుర్తించేందుకు పది బృందాలను ఏర్పాటు చేశారు. కుమార్తె అపహరణకు గురైన విషయం తల్లికి తెలియనివ్వలేదు. తండ్రికి సమాచారం ఇవ్వగా బుధవారం రాత్రి ఆస్పత్రికి చేరుకొని బోరున విలపించాడు.

ప్రజలను చైతన్య పరచండి

మెదక్, న్యూస్‌టుడే: మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచాలని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా కార్యదర్శి హన్మకొండ దయాసాగర్ ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రామాయంపేట మండలం క్యాట్రియాల్‌లో మూఢనమ్మకాల పేరుతో మహిళ ముత్తవ్వను సజీవదహనం చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని కోరారు.

నర్సాపూర్‌లో వేడుకలకు ఏర్పాట్లు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ పట్టణంలో గురువారం సద్దుల బతుకమ్మ, శనివారం దసరా పండగలను జరుపుకోవాలని నిర్ణయించినట్లు పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ తెలిపారు. బతుకమ్మ వేడుకలకు శివాలయం, పిల్లల ఉద్యానం ప్రాంతాల్లో, రాయరావు చెరువులో నిమజ్జనానికి ఏర్పాట్లు బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జమ్మిచెట్టు పూజలు చేసేందుకు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మోటార్ల వినియోగం.. కొందరికే మంజీరా

పురపాలిక	నర్సాపూర్
వార్డులు 15	జనాభా: 25,010
నల్లా కనెక్షన్లు	4,200
రోజువారీ డిమాండ్:	2.4ఎంఎల్‌డీ
సరఫరా అవుతున్నది	2.2ఎంఎల్‌డీ


మోటారు సాయంతో నీటిని లాగేస్తున్న చిత్రం

న్యూస్‌టుడే, నర్సాపూర్: నర్సాపూర్ పట్టణంలో 15 వార్డులకు సరిపడా నీటి సరఫరా జరుగుతున్నా కొందరు మోటార్లు ఏర్పాటు చేస్తుండగా అందరికీ నీరు అందడం లేదు. నల్లా కనెక్షన్లు ఉన్నా కొన్ని ఇళ్లలో అవి అలంకార ప్రాయంగా మారాయి. హోటళ్లు, మాంసం విక్రయ దుకాణాలు, ఆస్పత్రులు, మెకానిక్ దుకాణాలు, వాషింగ్ సెంటర్లు ఇలా వాణిజ్య దుకాణ సముదాయాల్లో అక్రమంగా మంజీరా నీటిని ఉపయోగిస్తున్నారు. పలుకుబడి గల వ్యక్తులు, రాజకీయ నాయకుల ఇళ్లల్లో రెండు నుంచి నాలుగు కనెక్షన్ల వరకూ ఉన్నాయి. వీటన్నింటిపై పురపాలిక దృష్టి పెడితే పట్టణంలో అందరికీ నీటి సరఫరా సాధ్యమవుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నీటి కనెక్షన్లపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు జారీ: పురపాలికలో ఇంటింటికి నల్లా నీరందించే మిషన్ భగీరథ నీటి పథకం సక్రమంగా అమలు కావడం లేదు. పుర పాలిక అధికారులు మాత్రం నల్లా బిల్లు నెలకు రూ.100 చొప్పున చెల్లించాల్సిందే అంటున్నారు. నీటి సరఫరా జరగనప్పుడు బిల్లులు ఎలా చెల్లిస్తామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి బిల్లులు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు.

తీవ్రమైన నీటి ఇబ్బందులు: పట్టణంలోని 15 వార్డుల్లో చాలా ఇళ్లకు మిషన్ భగీరథ నీటి సరఫరా కావడం లేదు. కారణం దాదాపు అందరూ నల్లాలకు మోటార్లు అమర్చి నీటిని తోడేస్తున్నారు. అన్ని వార్డులకు సరిపడా నీటి సరఫరా జరుగుతున్నా కొందరు ఉదయం పూట మోటార్లు ఏర్పాటు చేసుకుని కావాల్సినంత వరకూ నీటిని లాగేస్తున్నారు. ఒక్కో ఇంట్లో నాలుగు ఐదు వరకూ పోర్షన్లు అద్దెకు ఉంటున్నాయి. వాటికి మంజీరా నీరు అనేది తెలియదు. నల్లాలు బిగించే సమయంలో ఎవరైతే ఎంతోకొంత ముట్టజెప్పారో వారికి మాత్రం మూడు, నాలుగు కనెక్షన్లు ఇచ్చారు. డబ్బులు ఇవ్వని వారికి ఒకటి లేదా రెండో కనెక్షన్ తప్పితే ఉచితంగా ఎవ్వరికి ఇవ్వలేదు. పలుకుబడి కలిగిన వ్యక్తులు, వ్యాపార వాణిజ్య అవసరాలకు ఇష్టారీతిన నీటిని వాడేస్తున్నారు. 10,11 వార్డులు తప్ప మిగతా వార్డుల్లో ప్రజలు ఎక్కువగా నల్లా నీటిపైనే ఆధార పడి ఉన్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం

చాలా ఇళ్లల్లో నల్లా నీటిని కోసం మోటార్లను వినియోగిస్తున్నారు. ఈ విషయంలో పుర సిబ్బంది వార్డుల్లో విచారణ చేపట్టగా అక్రమ నీటి వినియోగం ఎక్కువగా ఉందని తేల్చారు. ఇలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేశాం. వీరిని తప్పకుండా కట్టడి చేస్తాం. అక్రమంగా నీటిని లాగేయడం సరికాదు. **అశోక్‌గౌడ్, పుర అధ్యక్షుడు, నర్సాపూర్**

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్ 95730 81675, నర్సాపూర్ 80085 73222, తూప్రాన్ 96762 58144, చేగుంట 80085 73200, పెద్దశంకరంపేట 80085 73251, రామాయంపేట 94402 31031 (10AM TO 1 PM)

న్యూస్‌టుడే, నర్సాపూర్ రూరల్: ? నర్సాపూర్ శివాలయం నుంచి కాగజ్‌మద్దూర వరకు తారురోడ్డు పలుచోట్ల గుంతల మయంగా మారింది. రాత్రిళ్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. -అశోక్‌గౌడ్, కాగజ్‌మద్దూర

✔ కాగజ్‌మద్దూర రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రాగానే పనులు చేపట్టి అవస్థలు దూరం చేస్తాం. -రాధికాలక్ష్మి, పీఆర్ ఏఈ

?తుజాల్‌పూర్ గ్రామానికి వెళ్లే రోడ్డులో నియంత్రిక ప్రమాదకరంగా ఉంది. వేరొక చోటకు తరలించి ఇబ్బందులు లేకుండా చూడాలి. -లక్ష్మీనారాయణ, తుజాల్‌పూర్

✔ ఈ విషయం మా దృష్టికి వచ్చింది. వెంట నర్సాపూర్ల పూర్తిగాంతే మరో చోటికి మార్చుతాం. - రాజ్‌కుమార్, విద్యుత్తు ఏఈ

దేశ సమైక్యత కాపాడేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి


ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల పథ సంచాలన్

పెద్దశంకరంపేట: దేశ సమైక్యతను కాపాడడానికి ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లుగా కృషి చేస్తోందని ఆ సంఘం మెదక్ విభాగ్ కార్యవహ్ బోల నాగభూషణం అన్నారు. ఆరెస్సెస్ స్థాపించి వందేళ్ల సందర్భంగా స్వయం సేవకులు బుధవారం పెద్దశంకరంపేటలో పథ సంచాలన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు విజయదశమి రోజున కేశవరామ్ బలిరామ్‌పంత్ హెడ్గే స్థాపించారన్నారు. భారతదేశం అన్నింటిలో ఆదర్శంగా నిలుస్తూ ప్రపంచానికి విశ్వగురువుగా మారిందన్నారు. ఆరెస్సెస్ బౌద్ధిక్ ప్రముఖ్ రవీందర్, పర్యావరణ ప్రముఖ్ రవివర్మ, భాజపా మండలాధ్యక్షుడు విఠల్, శ్రావణ్‌కుమార్, ఆరెసెస్సెస్ కార్యవహ్ జైహింద్‌రెడ్డి, సీతారామరావు తదితరులున్నారు.

మంత్రాల నెపంతో దాడులు చేస్తే చర్యలు తప్పవు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

రామాయంపేట, న్యూస్‌టుడే: మంత్రాలు, చేతబడి నెపంతో దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని రామాయంపేట తహసీల్దార్ రజని హెచ్చరించారు. మండల పరిధిలో దాడులు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం ప్రగతి ధర్మారంలో ఎస్సై బాలరాజుతో కలిసి మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవ వారికి వైద్యం చేయించాల్సి ఉండగా మూఢ నమ్మకాలతో అమాయకులపై దాడులు చేస్తున్నారన్నారు. దాడులకు పాల్పడి జైలు పాలు కావద్దని సూచించారు. ఏవైనా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.

సరస్వతీదేవీగా అమ్మ దర్శనం


పెద్దశంకరంపేట గడికోటలో కుంకుమార్చనలు


దొంతిలో..


నార్సింగిలో..


జగిర్యాలలో భజన చేస్తున్న భక్తులు


చేగుంట మండలం ఇబ్రహీంపూర్‌లో..

దసరా ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు మండపాల్లో అమ్మవార్ల వద్ద నిత్య పూజలు, అన్నదానం, హోమాలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బుధవారం సరస్వతీ మాతగా పలుచోట్ల భక్తులకు దర్శనమిచ్చారు. శివ్వంపేట, పెద్దశంకరంపేట, చిన్నశంకరంపేట, మాసాయిపేట, పాపన్నపేట, అల్లాదుర్గం. మెదక్, వెల్దుర్తి ఉమ్మడి మండలం, కౌడిపల్లి, రేగోడ్ మండలం జగిర్యాలలో యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి అమ్మవారి చిత్రపటాలు అందజేశారు. అవుసులపల్లిలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. – న్యూస్‌టుడే బృందం

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పోచయ్య

రేగోడ్, వెల్దుర్తి: అంతర్జాలం, చరవాణి, సామాజిక మాధ్యమాల్లో ద్వారా జరిగే సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పోచయ్య అన్నారు. బుధవారం ప్యారారంలో సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు చేస్తే స్పందించవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు చెప్పొద్దన్నారు. యువతి, యువకులపై తల్లిదండ్రులు పర్యవేక్షిస్తూ జాగ్రత్తగా ఉండాలన్నారు. వెల్దుర్తి బస్టాండ్ చౌరస్తా వద్ద దసరా షాపింగ్ కోసం తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి హెడ్ కానిస్టేబుల్ లాయక్ సాబ్ సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


చెక్కులు పంపిణీ చేస్తున్న జ్యోతికృష్ణ, శ్రీనివాస్, ప్రభుదాస్

తూప్రాన్, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని పురపాలిక ఛైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ అన్నారు. బుధవారం తూప్రాన్ ఇన్‌ఛార్జి తహసీల్దార్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే ఉచిత బస్సు సౌకర్యం, పేదలకు ఉచిత విద్యుత్తు అందిస్తుందన్నారు. దసరా తర్వాత పేదలకు ఇళ్ల పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు. పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు భగవాన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజు, నాయకులు రవీందర్‌గుప్తా, రఘుపతి, ఆంజనేయులు, ఆర్ఐ నాగరాజు తదితరులున్నారు. ఆయా గ్రామాలకు చెందిన 41మంది లబ్ధిదారులకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కౌశిక, ఆర్ఐ దీక్షిత్‌కుమార్ పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో కాంగ్రెస్‌కు అధికారం: వంటేరు

జగదేవపూర్: ఎన్నికల ప్రచార సభల్లో తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అమలులో విఫలమైందని ఎఫ్‌డీసీ మాజీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శివాజీ యువజన సంఘం ఏర్పాటు చేసిన శరన్నవరాత్రి పూజల్లో ఆయన బుధవారం పాల్గొని పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రుణమాఫీ పూర్తిచేయకపోగా, రైతు భరోసా ఊసే లేదన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు చేసిందేమీ లేదన్నారు. పది నెలల పాలనలో ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్యాక్స్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కవిత, భారాస మండలాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచి యాదవ రెడ్డి, నాచారం పాలకమండలి మాజీ డైరెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కుంట కాల్వ ఆక్రమణపై ఫిర్యాదు

శివ్వంపేట, న్యూస్‌టుడే: కుంట కాల్వ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారికి బుధవారం దంతాన్‌పల్లి గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన మెలకుంట అలుగు, కాల్వ, కుంట తూము పరిశీలించడానికి నర్సాపూర్ నీటి పారుదల శాఖ అధికారులు వచ్చారు. కాల్వ ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌కు సన్మానం

శివ్వంపేట: జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డిని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, జంగం వెంకటేష్, రమేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కమల తదితరులు కలిసి సన్మానం చేశారు.

మహిళా రైతుల అభ్యున్నతికి కృషి


వరి పంటను పరిశీలిస్తున్న వాణి

చేగుంట, న్యూస్‌టుడే: డ్రమ్ సీడర్‌ను ఉపయోగించి వరిసాగు చేపట్టడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని సెహగల్ ఫౌండేషన్ ప్రోగాం లీడ్ వాణి అన్నారు. బుధవారం ఉమ్మడి చేగుంట మండలం పోతాన్‌పల్లి, కసాన్‌పల్లి గ్రామాలకు చెందిన మహిళా రైతులకు డ్రమ్ సీడర్‌తో సాగుచేసిన వరి పంటను చూపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. మహిళా రైతుల అభ్యున్నతి కోసం తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుతో ఖర్చు తగ్గి అధిక దిగుబడులు వస్తాయన్నారు. శ్రవణ్, విజయ్, యాదగిరి పాల్గొన్నారు.

అలరించిన సద్దుల బతుకమ్మ సంబురం


శివ్వంపేట పెద్దచెరువుకట్టపై..


బోనాలు తీస్తూ..

నర్సాపూర్, శివ్వంపేట న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం జిల్లాలో పలుచోట్ల సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ మధులత సిబ్బందితో కలసి బతుకమ్మ ఆడారు. శివ్వంపేట పెద్ద చెరువుకట్ట పొడువునా బతుకమ్మలను ఉంచి దాండియా, కోలాటలతో మహిళలు, చిన్నారులు సందడి చేశారు.


నర్సాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న ఎంపీడీవో మధులత, సిబ్బంది

వృత్తి విద్యతోనే ఉపాధి

రేగోడ్, న్యూస్‌టుడే; విద్యార్థి దశ నుంచే వృత్తి విద్యపై అవగాహన పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పొందేందుకు తోడ్పడుతుందని ఉపాధ్యాయురాలు గీత అన్నారు. రేగోడ్ ఆదర్శ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులను, ఆరోగ్య జాగ్రత్తలపై వృత్తి విద్యా కోర్సు శిక్షణ పొందుతున్న వారిని బుధవారం నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయా అంశాలపై అక్కడ అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న ఆయా వృత్తి విద్యల్లో శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుస్తుల పంపిణీ

రామాయంపేట, న్యూస్‌టుడే: రామాయంపేట పుర ఛైర్మన్ జితేందర్ గౌడ్ దంపతులు పుర పారిశుద్ధ్య సిబ్బందికి బుధవారం నూతన దుస్తులు అందజేశారు. ప్రతి ఏటా దసరా పండగకు పుర సిబ్బందికి అందజేస్తున్నట్లు తెలిపారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయరూ!

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలను తొలగిస్తూ, వీధి దీపాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు డీఎల్పీవో సాయిబాబా సూచించారు. బుధవారం చిలప్‌చెడ్ ఎంపీడీవో కార్యాలయంలో వారితో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో వీధులను సందర్శించి, దస్త్రాలను పరిశీలించారు. ఎంపీడీవో ఆనంద్, ఎంపీవో శరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

మెదక్: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం వల్ల సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు అన్యాయం చేశారని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం స్థానిక రాందాస్ చౌరస్తా, కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వాలే చేసుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో, తప్పకుండా అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించి, నేడు మాట తప్పారని విమర్శించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు మురళి, శేఖులు, సామెల్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మాధవి, వినోద్ రామస్వామి, మహిపాల్ పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వానికి అనూహ్య స్పందన: భాజపా


రాజిపేటలో సభ్యత్వం అందిస్తున్న రమణారావు

కౌడిపల్లి, రామాయంపేట, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వానికి గ్రామాల్లో అనూహ్య స్పందన వస్తోందని ఆ పార్టీ నర్సాపూర్ తాలుకా కన్వీనర్ రమణారావు తెలిపారు. బుధవారం కౌడిపల్లి మండలం రాజిపేట, దేవులపల్లి, కొట్టాల, వెంకటాపూర్, భుజిరంపేట గ్రామాల్లో పార్టీ సభ్యత్వం చేయించారు. అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని సభ్యత్వాలకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సభ్యత్వ ప్రముఖ్ సతీష్, బూత్ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం, ఎస్సీ మోర్చా మండలాధ్యక్షుడు సాయి, నాయకులు నాగరాజు, మధు, క్రిష్ణ పాల్గొన్నారు. రామాయంపేటలో భాజపా పట్టణాధ్యక్షుడు భానుచందర్ సభ్యత్వ నమోదు చేపట్టారు. నాయకులు శంకర్‌గౌడ్, సతీష్ తదితరులున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

అల్లాదుర్గం: ప్రభుత్వం రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని భారాస మండలాధ్యక్షుడు పల్లెగడ్డ నరసింహులు అన్నారు. బుధవారం అల్లాదుర్గంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీ చేయడంలో రేషన్ కార్డులోని కుటుంబ సభ్యులకు లింకు పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నదాతలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

గజ్వేల్ గ్రామీణ: అనారోగ్యంతో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన గజ్వేల్ పట్టణంలో జరిగింది. సీఐ సైదా తెలిపిన వివరాలు.. రాయపోల్ మండలం ఎల్కంటికి చెందిన బుట్టోలా ఎంకవ్వ(65) ఈ నెల 4న ఆసుపత్రికి వెళ్తున్నానని చెప్పి గజ్వేల్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో స్పృహతప్పి పడిపోయి ఉన్న వృద్ధురాలిని గుర్తించిన స్థానికులు వైద్యులకు తెలుపడంతో అక్కడికొచ్చిన వైద్యులు ఆమెను పరీక్షించి అప్పటికే మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు

పాతకక్షలతో దాడులు.. ఇరువర్గాలపై కేసులు

మనోహరాబాద్, న్యూస్‌టుడే: మనస్పర్థలు రావడంతో రెండు కుటుంబాల మధ్య చిచ్చురేగి, దాడుల వరకు వెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన మొద్దు ప్రభాకర్, ఓ మహిళ చరవాణికి అనవసర సందేశాలు పంపాడని గతంలో సదరు మహిళ కుటుంబ సభ్యులు ప్రభాకర్‌పై దాడి చేశారు. దీంతో గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు చేయడంతో పలువురిపై కేసు నమోదు కాగా, వారంతా బెయిల్‌పై తిరిగి వచ్చారు. ఈ విషయంలో ఆగ్రహంగా ఉన్న ప్రభాకర్ కుటుంబసభ్యులు రెండు రోజుల కిందట సదరు కుటుంబంపై దాడి చేయడంతో పలువురు గాయపడ్డారు. వీరంతా ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రెండు కుటుంబాల సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఎవరైనా దాడులు, తీర్మానాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

కొల్చారం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధి రాంపూర్ శివారులో జరిగింది. ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణానికి చెందిన మధునాల నిఖిల్ మెదక్ డీపీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం కార్యాలయానికి వెళ్తుండగా రాంపూర్ శివారుకు రాగానే మెదక్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు తన ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అతడు రోడ్డుపై పడిపోగా, ద్విచక్ర వాహనం పూర్తిగా మంటల్లో కాలిపోయింది. గాయపడిన నిఖిల్‌ను ప్రైవేటు అంబులెన్స్‌లో మెదక్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని సోదరుడు మహంతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

శివ్వంపేట, న్యూస్‌టుడే: ఇంట్లో ఉన్న మహిళ మెడలో నుంచి బంగారం గొలుసు అపహరించిన ఘటన మగ్దుంపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బొల్లబోయిన సత్యమ్మ మంగళవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన కాశబోయిన ప్రశాంత్ ఇంట్లోకి వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గుండ్ల గొలుసు తెంచుకొని పారిపోయాడన్నారు. బుధవారం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

బాబోయ్ గ్రామ సింహాలు

భయాందోళనలో ప్రజలు


కాళ్లకల్‌లోని ఓ వీధిలో గుంపులుగా సంచరిస్తూ..

న్యూస్‌టుడే, మనోహరాబాద్: గ్రామాల్లో శునకాలు స్వైర విహారంతో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఓ వృద్ధుడిని శునకాలు కరవగా తీవ్ర గాయాలయ్యాయి. ముప్పిరెడ్డిపల్లిలో ఓ యువకుడిని, వృద్ధుడిని కరిచి గాయపరిచాయి. ఇలా గ్రామంలో గుంపులుగా శునకాలు సంచరించడంతో ఒంటరిగా బయటికి వెళ్లాలంటే జంకాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ రాజ్ శాఖ నుంచి చర్యలు తీసుకుని గ్రామాల్లో వీధి శునకాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మండలంలోని ఆయా గ్రామాల్లో రోజురోజుకు శునకాల దాడులు పెరిగిపోతున్నాయి. సంబంధిత అధికారులు శనకాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు రావాలంటే భయం: గ్రామాల్లో వీధి శునకాలను పట్టుకుని బయట వదిలేసే పరిస్థితి లేదు. పల్లెల్లో ఒక్కోచోట పదుల సంఖ్యలో ఉండడంతో ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని వెంటపడి మరి కరవడంతో భయభ్రాంతులకు గురై గాయపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గ్రామాల్లో చిన్నారులను ఒంటరిగా బయటకు పంపే పరిస్థితి లేదు. వీటిని అరికట్టేందుకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

తగిన చర్యలు చేపడతాం: లక్ష్మీనర్సింహులు, ఎంపీవో, మనోహరాబాద్

మండల కేంద్రంలో తహసీల్దార్ ప్రత్యేక చొరవతో, కూచారంలో ప్రత్యేక సిబ్బందితో వీధి శునకాలను పట్టించి అటవీ ప్రాంతంలో వదిలేయాలని సూచించాం. వీధి శునకాలపై చర్యలపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. వ్యాక్సినేషన్, కుక్కలను గాయపరచడం వంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో గ్రామం చొప్పున మండలంలోని అన్ని గ్రామాల్లో శునకాలను పట్టించి అడవుల్లో వదిలేస్తాం. సొంతంగా శునకాలు పెంచుకునే వారు ఎవరికి హాని తలపెట్టకుండా చర్యలు తీసుకోవాలి.

పీఆర్టీయూ గౌరవ అధ్యక్షులుగా ఏడుగురికి అవకాశం

శివ్వంపేట, న్యూస్‌టుడే: పీఆర్టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఏడుగురు ఉపాధ్యాయులు, రాష్ట్ర కార్యదర్శిగా ఒకరు శివ్వంపేట మండలం నుంచి ఎన్నికయ్యారు. మండలంలోని చండి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఎడ్ల దయానంద్ రెడ్డి, పాంబండ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు కల్వకుంట్ల శ్రీధర్ రావు, దొంతి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నాగేశ్వర్‌రావు, గోమారం ఉన్నత పాఠశాలకు చెందిన స్వామి, చిన్నగొట్టిముక్క ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు రాజేందర్ రెడ్డి, చెన్నాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన నర్సాగౌడ్, పాంబండ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు చెన్న రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఎన్నిక కాగా, రాష్ట్ర కార్యదర్శిగా మల్లుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మధుసూదన్‌రావు ఎన్నికయ్యారని సంఘం నాయకులు అనిల్‌రెడ్డి, రాఘవేందర్ తెలిపారు.

కాన్షిరామ్‌కు నివాళి

చేగుంట, న్యూస్‌టుడే: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షిరామ్‌కు ఆ పార్టీ నాయకులు బుధవారం చేగుంటలో ఘనంగా నివాళులు అర్పించారు. కాన్షిరామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆ పార్టీ మండలాధ్యక్షుడు భానుచందర్, జిల్లా నాయకులు నర్సింహులు, జనార్దన్‌గౌడ్, నరేష్ తదితరులున్నారు.